3

తాంబూలాలిచ్చేశారు

"నన్ను సినిమాకెవరెవరు తీసుకెళ్తారో చటుక్కున చేతులెత్తండోయ్" అంటూ సుడిగాలిలా దూసుకువచ్చాడు సుబ్బారావు 'లవర్స్‌డెన్' లోకి. 'లవర్స్‌డెన్' హాస్టల్‌లో మూడో నెంబరు గదికి ముద్దుపేరు. ఈ గది హాస్టల్ కట్టిన నాటినుండి భగ్నవీణలకీ, ఛిద్రహృదయాలకీ నిలయంగా ఉంటూ వచ్చింది.

సుబ్బారావు దూకుడుగా వచ్చినవేళకి, ఒక మజ్నూ భారీయెత్తున సిగరెట్టు కాలుస్తూ బాధపడుతున్నాడు. ఆ మజ్నూ ఇహలోకనామం రాజు. బాధపడుతున్న రాజుని చూస్తూ విచారపడుతున్న అప్పారావు మెల్లిగా తలఎత్తి ఒక్కక్షణంచూసి, తల దించుకుని మళ్ళీ విచారపడడం మొదలుపెట్టాడు.

"కావలిస్తే నా డబ్బులు నేను పెట్టుకుంటా. మొత్తం ముప్పావలా ఉంది" అనేశాడు సుబ్బారావు తెగించి.

"ఏ సినిమారా. బతుకే ఓ సినిమాలాఉంటే ఇంకా సినిమా ఏమిటి?" అన్నాడు రాజుతరఫున అప్పారావు.

"ఏమా కథ? సినిమా అయితే మరి సీతా అమ్మ వారెవరు? రాభణాసురు డెవడు? రేలంగి ఎక్కడ?"

"ఇంకా ఖరారుగా తెలీదుగదా. రాజు ఇవాళే ఊళ్లో దిగాడు. దిగీదిగుతూనే, ఆ పిల్లని చూశాడు."

"ఏ పిల్లని?"

"ఏమో ఎవడికి తెలుసు? ఇవాళ ఆదివారంకదా? రేపు కాలేజి తెరిస్తే వీడు రేపటిలోగా స్వర్గస్థుడయిపోకుండా కాలేజికి వస్తే, అక్కడ ఆ పిల్ల ఎవరో కనబడితే...ఆపైన తరువాయి కథ ఉంటుంది. ఆమెగాని ఏ థర్డుఫారం ఆనర్సో అయితే, రహదారిమీద పడిగాపులు పడాల్సిందే" అన్నాడు అప్పారావు.

"నేను సస్పెన్సు భరించలేను. అసలే గుండె నీరసం వాణ్ణి. అందుకని నేను ఒక్కణ్ణే ఎలాగో అలా వెళ్లి సినిమా చూసేస్తా. సాయంత్రంకథ చెబుతా లెండి. ఇంతకీ పేరు లేకపోతే మానే, అసలా సీతమ్మ లైలా స్వరూపం ఏమిటో కాస్త చెబుదూ రాజూ" అన్నాడు సుబ్బారావు.

"అబ్బ! వాడసలే ఒఖలా మధనపడుతూఉంటే, నువ్వు మరింత రెచ్చకొడతా వెందుకూ? నే చెబుతా పట్టు, శాటిన్ దిళ్ళూ, ముక్కుపుడకలూ, ఒంటిపేట గొలుసులూ, ముఖమల్ జోళ్ళూ వీడు ఇవాళ చూసిన పిల్లకోసమే ఉత్పత్తి చేస్తోందట ప్రపంచం. ఫీయట్ కారు ఈ అమ్మాయి, ఆమె కాబోయే భర్తా తిరగడానికి డిజైన్ చేశారట. మామూలు మనుషులకి ఆమెకళ్లు చింపిరికళ్ళలా కనబడ

తాయికాని, సౌందర్యదృష్టి ఉన్న పీడివంటివాళ్ళకి, అందమైన కళ్లనేవి ఉంటే అవే సుమా అని ప్రబోధిస్తుందట మనసు. ముక్కుపుడకలు పాత ఫ్యాషన్ అనుకునేవారంతా ఆ అమ్మాయి సన్నటి ముక్కుమీద చిన్న ఒంటిరాయి ముక్కుపుడకని చూశారంటే తపీమని అభిప్రాయాలు మార్చేసుకుంటారట. ఇది ప్రథమ తరంగం. రాజు దిగీ దిగగానే ఇచ్చిన ప్రారంభోపన్యాసం.''

సుబ్బారావు ఈ తరంగం విన్నాడో లేదో కాని, కింద పడిఉన్న సీమవెండి సిగరెట్ కేసుని స్వాధీన పరచుకున్నాడు. తన జేబులో సిగరెట్లన్నీ ఒక్కొక్కటి అందులో అతి జాగ్రత్తగా అమర్చాడు. ఇంకా ఖాళీ మిగిలిపోయింది.

నాదగ్గర ఆట్టే డబ్బులులేవు. ఇక్కడి సిగరెట్లు కాసిని తీసుకుంటానని ఒక చిన్న జనాంతికప్రకటన చేసి, అక్కడున్న రెండుపెట్టెలూ తెరిచి సీమవెండి డబ్బా నింపేశాడు.

''ఊఁ, రెండవరంగం ఆనక వింటానుగాని టైమైంది. మళ్లా వస్తా'' అన్నాడు లేవబోతూ.

''బొత్తిగా ఇంత స్వార్థం అయితే ఎలాగోయ్. ఇవతల వీడు మతిభ్రష్టుడై ఇలాఉంటే, దయా దాక్షిణ్యం లేకుండా సినిమాకి పోతాననడానికి మనసెలా ఒప్పిందంట? పైగా ఆ సిగరెట్లు ఊడ్చేసుకుపోతే మేం ఎలా ఏడవడం?'' అంటూ చిరాకుపడ్డాడు అప్పారావు.

''ఆఖరికి సిగరెట్లుకూడా లేకపోయాయే అని ఏడవండి జమిలిగా అయినా, మతీ సుతీ లేకపోతే సరి. ఎవరైనో చూసీ

చూడనట్లు చూసి, ఇలా బెంగెట్టుకోవడం సిల్లీగా లేదూ? మీనాన్నకి ఉత్తరము రాస్తానుండు రాజూ, అప్పుడు తెలుస్తుంది."

"ఏడిశావు లేవోయ్, బోడిపెద్దరికం నువ్వూను! వాళ్ళ నాన్నగారు మొన్ననే శాంక్షన్ చేసేశారుట - వీడు వరించిన అమ్మాయిని తెచ్చి పెళ్ళిచెయ్యడానికి. ఎటొచ్చీ, ఆయనతో సి. పార్వతి (బి. ఏ. సెకండియర్ మూడో దండయాత్ర) ని పెళ్ళిచేసుకుంటానని చెప్పి వచ్చేశాడు. ఆయన సరేననేశాడట" అన్నాడు అప్పారావు.

"మరింకేం? ఈ ఏడుపేమిటి?"

బాధపడుతున్న రాజు ఇంక సహించ లేకపోయాడు.

"ఏడు పేముందిరా ... నేను మాత్రం కలకన్నానేమిటి ప్రపంచంలో, ఇవాళ చూచిన అమ్మాయంత అందమైనవాళ్లు...అసలు అందం కాదులే. అదేదో చెప్పలేం ఒక విధమైన వెలుగు - జ్యోతి..."

రాజు చెలికాడు ఈ అవస్థ చూడలేక, ఆదుకున్నాడు, "అయినా ఎందుకు రాజూ వీడికి చెబుతావు నీ బాధంతా? ఆర్చేవాడా తీర్చేవాడా" అంటూ.

"నేను ఆర్చేదీ తీర్చేదీ ఏం లేదుకాని, ఇప్పుడేం చేస్తారని అడిగానంతే" అన్నాడు సుబ్బారావు చిన్నబుచ్చుకుంటూ.

"చెయ్యడానికేముంది? రేపు ఈ కొత్త పిల్లపేరు, పై విలాసం తెలియగానే, వాళ్ళనాన్నకి టెలిగ్రాం యిచ్చేస్తాడు. చిన్న సవరణ వుందనీ, మొన్న చెప్పిన పార్వతి బదులు ఇంకో సరస్వతిని పెళ్లాడ నిశ్చయించుకున్నాననీని, ప్రమాదం ఏముంది? పేరు మార్పేగా?" అన్నాడు అప్పారావు.

"మరే! ప్రమాదం ఏముంది?" అన్నాడు సుబ్బారావు.

సోమవారం ఉదయం పది గంటలకి కథ చాలా ముందుకు వెళ్ళిపోయింది.

రాజు చూసిన లేడి పేరు సరోజినిట. ప్రొద్దున రాజూ, అప్పారావు కాలేజికి వెళ్ళేసరికి ఆ పిల్ల కనబడింది.

"అదుగో ఆ అమ్మాయేరా" అన్నాడు రాజు ఎగిరి గంతేసి, తూలి కిందపడబోతూ.

"హారి నీ...ఆమె పేరు నైన్ డౌన్, ఈ ఏడే చేరింది. ఏదీ వచ్చి వారంరోజులైపోయిందో లేదో నలుగురైదుగురు రోమియోలు ఆదరా బాదరా వరించేసి, వరుసక్రమంలో దృక్పథాలు మార్చేసుకుని, చెంపలు వాయించేసుకున్నారు. కాలేజి తెరవగానే నువ్వూ వచ్చి ఉంటే, అందరితో పాటే ..." అన్నాడు అప్పారావు.

"ఛా. అలా అనకురా, నిన్న చూసినపుడే అనుకున్నాను 'పార్వతి ఈ అమ్మాయి కాలిగోటికి సాటిరా'దని. పే రేమిటన్నావు?"

"నైన్ డౌన్ అని చెప్పాను. కలకత్తా మెయిలు మెడ్రాసునించి వచ్చే వేళకి ఈవిడ కాలేజిరోడ్డులో నడుస్తూ ఉంటుంది. క్లాసులో నెంబరు 32 అనుకో. అసలు పేరు సరోజిని. ఇంట్లో 'సరూ' అంటారు. రేప్పొద్దున్న పెళ్ళాడితే నువ్వూ..."

"ఛీ పో" అన్నాడు రాజు సిగ్గుపడుతూ.

క్లాసులోకి వెళ్ళారిద్దరూ.

మొదటి గంట పూర్తికాగానే వరండాలోకి వచ్చే సరికి సుబ్బారావు కనబడ్డాడు. రాజు పిలిచాడు. దగ్గరికి రాగానే రాజూ, అప్పారావూ ఎడా పెడా నిల్చుని సుబ్బారావు తలకాయవంక చూడసాగారు. రాజు ఈర్ష్యతో చూశాడు; అప్పారావు జాలిగా చూశాడు.

"ఏం అలా చూస్తున్నారు ?" అన్నాడు సుబ్బారావు బిక్క మొహం పెట్టి.

"పరుగెట్టు కెళ్ళిపోయి గుండుచేయించుకొచ్చెయ్. లేకపోతే సాయంత్రం హాస్టల్ కి రాగానే చావగొడతా" అన్నాడు రాజు.

"నా కేం, నీ మంచికే చెబుతున్నాం. అయినా కాకపోయినా, సినిమా హీరోల్లాగ నీకు ఉంగరాల జుట్టేమిటోయ్ భగవాన్లూ" అన్నాడు అప్పారావు.

"నా జుట్టు గోల నీ కెందుకోయ్! హనుమాన్లూ? మా నాన్న, అమ్మ, బాబాయ్, పిన్ని, మావయ్య, అక్కయ్య, బామ్మ నీతో కలిసి ఎనమండుగురు నా క్రాపు

గురించి సలహా ఇస్తారా? అయినా ఇప్పుడిది ఫ్యాషను కాదుగా'' అన్నాడు సుబ్బారావు.

"కాకపోవడ మేమిటి! నాకు తెలిసిన రహస్యం నలుగురికి తెలిస్తే, సాయంత్రానికల్లా ఉంగరాలక్రాఫింగే 1956 ఫ్యాషన్ అయి ఊరుకుంటుంది. సరోజకి నచ్చిందంటే మాటలతో పనికాదు'' అన్నాడు కాస్తగొంతు తగ్గించి.

"అయ్యో బాబోయి. ఆ ఫాణీకి నాక్రాఫింగు నచ్చిందేమిటి కొంపతీసి, ఇప్పుడేందారి?''

"దారికేముంది, దారి గోదారి. గబగబ సెలూన్‌కి వెళ్ళు. అంటకత్తెర సాధ్యమైనంత వికృతంగా చెయ్యమను. కావలిస్తే ఓపావలా ఎక్కువిస్తానని ఆశపెట్టు. అక్కణ్ణించి గోదారికెళ్ళి నెత్తినిండా స్నానంచేసి దేవుడికో దణ్ణం పెట్టుకుని ఇంటికెళ్ళి పడుకో. లేకపోతే, ఫాణీ ప్రేమిస్తుంది. వరిస్తుంది. చూస్తూవుండగానే పెళ్ళాడేస్తుంది. జాగర్త'' అని హెచ్చరించాడు అప్పారావు.

రంగుల క్రాఫింగు సుబ్బారావు వెంటనే సెలవు పెట్టేసి ఇంటికి వెళ్ళిపోయాడు.

ఇటు రాజుకూడా సెలవుపెట్టేసి, బజారుకెళ్ళి తిరిగి తిరిగి, జుట్టుని ఉంగరాలు తిప్పే క్లిప్పులు కొనుక్కొని, హాస్టలుకెళ్ళి అవి పెట్టుకు తలకట్టుకు పడుకున్నాడు. సుబ్బారావును హడలకొట్టడం అంతా బాగానేవుంది కాని, దాని కోసం సరోజిని ఫాణీ గీణీ అంటూ అప్పారావు హేళనగా మాట్లాడడం నచ్చలేదు రాజుకి. చిరాకేసింది కూడా.

"నాలుగురోజులలో కాస్త ఉంగరాలు తిరిగితే, సరోజసంగతి నాన్నకు రాసెయ్యవచ్చు" అనుకున్నాడు.

హాస్టల్ కుర్రాణ్ణి పిలిచి సెలవుచీటీ రాసి పంపేశాడు కాలేజికి.

*　　　*　　　*

మధ్యాహ్నం ఇంటర్ వెల్ వేళకి అప్పారావు రొప్పుకుంటూ వచ్చాడు లవర్స్ డెన్ కి.

"నీదుంప తెగా! నీకేం మతి గినా పోయిందిట్రా! ఏమిట్రా ఈ సెలవు-చీటీ? ఇది లెక్చరర్ కంటబడితే ఇంకేమేనా ఉందా? "నౌకరు నాకంటబడి నాచేతికిచ్చాడు గాబట్టి సరిపోయింది" అంటూ గది అదిరేట్టు గావు కేకలు వేశాడు.

"పోరా, నీకేం తెలుసు నా ఆవేదన...సరూకి ఉంగరాల జుట్టంటే ఇష్టమని తెలిసి తెలిసి ఈ జూలుతో ఎలా రమ్మనావురా? మొహంచెల్లొద్దూ? నాలుగు రోజుల్లో రింగులొచ్చేస్తాయని షాపువాడు చెప్పాడు. అందుకని సెలవు పెట్టేశా" అన్నాడు రాజు క్లిప్పులు అదుముకుంటూ.

"అయితే ఈగోలంతా అందులో రాసుకుంటారుట్రా! చదివిచూడు."

రాజు ఆ బాధతోనే విసుగ్గా తను రాసిన సెలవు-చీటీ అందుకుని చదువుకుని ఐదంగుళాల ఎత్తుకి ఎగిరిపడ్డాడు.

ఉంగరాలు తిరగందే కాలేజీకి రావడానికి మనస్కరించటంలేదు కాబట్టి, దయతో తనకు ఐదురోజులు సెలవు ఇప్పించాలని ఆ సెలవు చీటీలో ఉంది.

"ఎవరూ చూడలేదుగదా కొంపతీసి...బుర్రెక్కడో పెట్టుకు రాసేశానుసుమీ... డామిట్... నయమే. నువ్వు చూశావు గనక సరిపోయింది" అంటూ దాన్ని చింపేశాడు రాజు.

ఇంకో సెలవుచీటీ రాయించి పట్టుకు పోయాడు అప్పారావు.

మధ్యాహ్నం మొదటిగంట పూర్తి అయీ అవగానే అప్పారావు సైకిలెక్కి మళ్లా వచ్చాడు హాస్టలుకి.

"ఓరేయ్ రాజూ! సుబ్బిగాడి జుట్టు నెరిసినా సరోజకి ఇష్టమేటరోయ్. తెలివితేటలు - అనగా విజ్ఞానం ఎక్కువ అయితే నీ అసలు జుట్టు నెరుస్తుందని అంచేత సుబ్బిగాడు పోతపోసిన విజ్ఞాని అనీ సరోజ అభిప్రాయం. ఇది తాజావార్త" అని చెప్పేసి చక్కాపోయాడు.

జుట్టు నెరవడం ఎలా అన్న సమస్య పట్టుకుంది రాజుకి.

సబ్బుతో తలరుద్దుకోన్నా, ఓ పావలా తేనెకొని పులుముకున్నా, జుట్టు నెరుస్తుందని జ్ఞాపకంవచ్చింది. కొంప తీసి ముగ్గుబుట్ట అయి ఊరుకుంటే? పాయింటే. అందువల్ల అక్కడక్కడ అందంగా నెరవాలి. మానసిక వేదనవల్ల, అప్పులు, ఇంట్లో ఆవాలు మెంతులు నిండుకొనుట మొదలైన బెంగలవల్ల జుట్టు క్రమబద్ధంగా నెరుస్తుంది. విజ్ఞానం వల్లకూడా నెరిసేమాట నిజమేకాని అదెక్కణ్ణించి వస్తుంది?

"జ్ఞానం లేదా గాడిదా?" అని నాన్నగారు తిట్టేవారు. జ్ఞానమే లేనివాడికి, 'విజ్ఞానం' ఎక్కణ్నించివస్తుంది? ఈ పంథాలో సతమతం అవడం సాగించాడు రాజు.

*　　*　　*

సాయంత్రం కాలేజి వదలగానే రివ్వున వచ్చాడు అప్పారావు ఇంకో బులెటిన్ పట్టుకుని. రాజు అడగబోతున్న ప్రశ్నే అప్పారావు అడిగేశాడు.

"ఏం బ్రదర్ నీకు జనరల్ నాలెడ్జి ఉందా? చాలా అర్జెంటు. బోలెడుంటే సరోజ నీది. లేకపోతే, సుబ్బిగాడు సరోజ వాడు" అన్నాడు.

"నేనూ అదే చూస్తున్నాను. విజ్ఞానం ఉంటే జుట్టు నెరుస్తుంది. ఎలా చెప్పు సంపాదించడం?"

"అయినా చూద్దాం ఉండు. అంజలి నాగేశ్వరరావూ, నటించిన— ఐమీన్ విడివిడిగా - మొదటి సినిమాలు ఏమి? వారిద్దరు కలసి నటించిన మొదటి చిత్రం ఏది ?"

రాజు తడుముకోకుండా చెప్పేశాడు.

"మధుబాల దిలీప్ కలిసినటించిన లేటెస్టు పిక్చర్ ఏమిటి?"

ఇదిగూడా ఠాప్‌మని చెప్పేశాడు రాజు.

"హారినీ ఇంత విజ్ఞానం ఉండికూడ ఇంకా జుట్టు నెరవకపోవడం ఏమిట్రా నీకు? ఇదేదో చిత్రంగా ఉందే?"

"పోదూ, నువ్విలా అంటావు కానీ, నీక్కూడా ఇవన్నీ తెలుసుకదా. నీకు మాత్రం నెరవడం లేదేం..."

"ఇది కాదేమో విజ్ఞానం. పోనీ నైన్‌డౌన్ టెనప్, తర్టీటూ అంటే అర్థాలు చెప్పు."

"నైన్‌డౌన్ అంటే సరోజ. టెనప్ అంటే సీతాలక్ష్మి. సరే తర్టీటూ మన ప్రొఫెసరుగారి రమ్యామ్మయి సుందరి" అన్నాడు రాజు.

అప్పారావు విరగబడి నవ్వాడు. "ఓరి అమాయకుడా. నైన్‌డౌన్ అంటే కలకత్తా మెయిలు. టెనప్ అంటే ఇంకేదో రైలు. తర్టీటూ అంటే పూరీపాసింజరూను. సరే ఏదో తిప్పలుపడు!"

"రైల్వే గైడుకొని చదివేస్తే?"

"నీ బొంద రైలు సంగతులు మాత్రం తెలిస్తే ఏం లాభం. మిగతావో?"

"మరెలాగ?"

"ఏమో"

* * *

మర్నాడు ప్రొద్దున్న కాలేజికి వెళ్ళగానే ఒక న్యూస్ బులెటన్ పంపించాడు అప్పారావు.

"రాజూ రాజూ. సుబ్బిగాడు అంటకత్తెర మొహంతోనే కాలేజికి వచ్చేశాడు. ఇంకా రింగ్‌లు పోలేదుకాని, జుట్టంతా అరంగుళం మేకుల్లావుంది. అయితేనేం వెధవ బావున్నాడురా హాలీవుడ్ హీరోలా—దాదాపు క్లార్క్

గేబుల్‌లా తయారయ్యాడురా. అయినా, ఈ వెధవికి చదువంటే బొత్తిగా ఇంత శ్రద్ధాభక్తులు యెందుకో నాకు బోధపడలేదు. నీకు మళ్లే నాలుగురోజులు సెలవు పెట్టుండాల్సింది.

ఇట్లు, అప్పారావు.

పి. యస్ :— సరోజ ఫస్టు పీరియడ్‌లో వాడివంక మూడుసార్లు సూటిగా చూసింది—సారీ. అ. రావు.

రెండవగంట కాగానే ఇంకో బులెటిన్ వచ్చింది.

"రాజూ. ఇది నీకు తెలుసా? రైలుస్టేషనులో ఉత్త పుణ్యానికి ఇనపరేకుల తోరణాలలాటివి పట్టాలకడ్డంగా కట్టి ఉంటాయి. అవి ఎందుకో తెలుసా?— ఇట్లు అప్పారావు.

పి. యస్ :—సరోజకి తెలుసట! అ. రావు.

లంచ్ ఇంటర్‌వెల్‌లో అప్పారావు వచ్చీ రాగానే అడిగాడు "ఏం రాజూ. తెలిసిందా జవాబు?" అని.

"ఊహుఁ ... నీకు?"

"నాకూ తెలీదు. పైగా సుబ్బిగాడికి తెలుసుట. ఇదే కాదు. వాడికి చిల్లర విషయాలు కొల్లలుగా తెలుసుట. ఈ సంగతి సరూకి తెలుసుట."

"సాయంత్రం కేకేసుకురారా వాణ్ణి" అన్నాడు రాజు.

"ఎవర్ని? నన్నేనా?" అంటూ సుబ్బారావు ప్రవేశించాడు దూకుడుగా.

"వెదకబోయిన తీగా! వెయ్యేళ్ళు బతుకు. కాని, నీకీ అడ్డమైన సంగతులూ ఎలా తెలుస్తాయిరా?'' అన్నాడు రాజు.

"ఇప్పుడు మళ్ళా ఏం జరిగింది? ఆ పిల్ల...''

"మరే ఆ పిల్లకి ఉంగరాల క్రాఫింగు నెరిసినజుట్టూ అంటే ఇష్టం. పైగా నీకు లోకంలో తెలీని సంగతులు లేవనీ, నువు మహా మంచివాడివనీ ఆ పిల్ల నమ్మకం నాకేం'' అన్నాడు అప్పారావు.

"చిత్రంగా ఉందే. నా చరిత్ర అంతా ఎలా తెలుసుకుందో'' అన్నాడు సుబ్బారావు.

"అదేవిటి? భయపడ్డం మానేశావా? ఆ పిల్ల నిన్ను పెళ్ళాడుతుందని భయం లేదు?''

"భయం ఎందుకు? అంతగా బెదిరిస్తే అక్కర్లేదని ఖచ్చితంగా చెప్పేస్తా...ఎటొచ్చి...''

"సరేగాని, నీ రహస్యం చెప్పు. నీకు చిన్న చిన్న విషయాలు, చిల్లరవిషయాలు అశోకుడేంచేశాడో. నీళ్ళలో ఇనపముక్క మునిగితే కర్ర ఎందుకు తేల్తుందో. ఇండియా ఆఖరి గవర్నరుజనరలు ఎవడో—ఇలాంటివెలా తెలుసు?''

"ఆ, దానికేముంది. మాతమ్ముడికి రోజూ రెండు పూటలా పాఠం చెప్పకపోతే, మా నాన్నగారు డొక్క చీల్చేస్తానని చెప్పారు. అందుకని, పాఠం చెబుతూ ఉంటే, ఇవన్నీ తెలుస్తున్నాయి'' అన్నాడు సుబ్బారావు.

"రైటో, నువు తక్షణం వెళ్ళిపో,'' అన్నాడు రాజు.

* * *

ఆ సాయంత్రమే, వాకబుచేసి, ఫస్టుఫారం చదువు తున్న తమ్ముడు గల ఒక అన్నయ్యని మంచిచేసుకున్నారు. ఆ అబ్బాయిదగ్గిర ట్యూషన్ చెప్పించుకుంటా నన్నాడురాజు.

"కుర్రవెధవ దగ్గర నువు ట్యూషన్ చెప్పించుకోవడ మేమిటి? సిల్లీ" అన్నాడు మిత్రుడు.

రాజు గంభీరంగా నవ్వాడు. "ఇంద్రుడు వజ్రాయుధం దేంతో చేశారు?"

"వజ్రంతో"

"చూశావా. అది తప్పాట."

"నువ్వు చెప్పు చూదాం." అన్నాడు స్నేహితుడు.

"నాకు తెలీదు మీ తమ్ముడిని అడుగుదాం."

ఎముకతో చేశారు అని తమ్ముడు చెప్పాడు కాని రాజుకి కూడా నమ్మకం కుదరలేదు.

"ఎవరి ఎముకలు అని అడిగాడు."

"దధీచి అనేవాడు ఇచ్చాడు."

"కర్ణుడుకాదా?..." అన్నాడు రాజు.

"కాదురా, బలి అయి ఉండొచ్చు."

"అబ్బే దధీచే. మా వాచకంలో ఉంది" అని నొక్కి చెప్పాడు చిన్న కుర్రాడు.

రైట్ అనేసి, ట్యూషన్ ఏర్పాటు చేసుకున్నాడు రాజు. రెండు పూటలూ ఆ కుర్రాణ్ణి ఆ కాఫీహోటలుకి అక్కణ్ణించి హాస్టలుకీ తీసుకెళ్ళడం, పాఠాలు నేర్పినట్టు

నేర్పుతూనే వాటిని తనే నేర్చుకోవడం సాగించాడు. బుధ, గురువారాలు హోరాహోరీగా చదువు సాగింది. మరోపక్క గ్రాఫింగుకు రింగులు తిరుగుతున్న ఛాయలు కనబడ్డాయి.

కాలేజీలో అంతా రాజుగురించి, అతని రింగుల గ్రాఫింగుగురించి, ఖాళీ ఉన్నపుడల్లా కబుర్లు చెప్పుకుంటున్నారు. రింగులు తిరుగుతాయా తిరగవా అన్న విషయం మీద కొందరు పందెం అనుకుంటున్నారు. కొందరు హాస్టలుకి వెళ్ళి రాజునీ పరామర్శ చేస్తూ వచ్చారు.

* * *

శుక్రవారం సాయంత్రం రాజు చిరాగ్గా పచార్లు చేస్తూ ఉండగా, గురుతుల్యుడైన శిష్య పరమాణువు వచ్చాడు.

"నా తెలుగువాచకం దొరికిందండి. శిబి పాఠం చదివానండి. మరండె నిన్న మీరు చెప్పింది తప్పండి. శిబిచక్రవర్తిని డేగ తినెయ్యలేదుట. తినెయ్యి కావలిస్తే అని శిబి ఊరికినే అన్నాడు. అప్పుడేమో డేగ ఇంద్రుడైపోయి..."

"ఒద్దులేవోయ్ ఆపెయ్. నాకా కథ అక్కర్లేదు. నాదే తప్పులే" అన్నాడు రాజు విసుగ్గా.

"పోనీ తెలుగు ఒద్దు లెండి...జాగర్ఫీకూడా మీరు చెప్పింది తప్పండి...కాన్పూరు కందిపప్పుకి ప్రసిద్ధికెక్కింది."

"ఇదిగో అబ్బాయ్, కాన్పూరు సంగతి నాకు తెలీదు కాని, ఇండియన్ ఆర్చిపెలగోలో పేము బాగా పండుతుందని నాకు బాగా తెలుసు. పేకబెత్తాలు మన వూళ్ళోకి దిగు

మరి అయ్యాయికూడా. నువు వెంటనే ఇంటి కెళ్ళకపోతే పేకావారమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తా...'' అన్నాడు రాజు మహా కోపంగా. శిష్యుడు తెలుగువాచకం అక్కడే పడేసి ఇంటికి పరిగెత్తాడు.

అంతలోనే అప్పారావు రొప్పుతూ రోజుతూ వచ్చాడు.

''అబ్బాయ్ రాజూ, తాంబూలాలిచ్చేసుకున్నారట. తన్నుకుచావు. నాకు నిజంగా బాధగా ఉందనుకో. కథ అడ్డం తిరిగిపోయి పెడదారిన చాలా దూరం వెళ్ళిపోయింది, సారీ'' అన్నాడు ఒగురుస్తూ.

''ఎవరిగోల నువ్వు చెప్పేది?'' అన్నాడు రాజు చాలా తాపీగా, నిశ్చలంగా, నిబ్బరంగా.

''అదే అదే నీ...ఐమీన్...సరోజ...ఆ అమ్మాయికి సుబ్బిగాణ్ణిచ్చి పెళ్లి చెయ్యడానికి వాళ్ళవాళ్ళ నాన్నగార్లు, పెద్దలూ నిశ్చయించేసి తాంబూలా లిచ్చేసుకున్నారు. వాళ్ళూ, వాళ్ళూ దూరపు చుట్టాలుట. అసలు బంధుత్వం ఎలా ఏడిసినా, ఈ పిల్ల 'పెళ్ళిచేస్తారా చస్తారా' అని హఠం వేసుకు కూర్చుందిట. మన వెధవ ముసిముసినవ్వులు నవ్వుతున్నాడు. అయినా కాకపోయినా తండ్రి యెడల ఎంత భయంభక్తులున్నా మరీ ఇంతా...''

''ఎవరూ నువు చెప్పేది, సరోజిని సంగతా? ఆ పిల్ల సుబ్బారావుని పెళ్లాడితే వచ్చిన ముప్పేమిటి?'' అన్నాడు రాజు తాపీగా.

"హోరి పిడుగా, ఆదివారం పొద్దుట్నుంచి ఇవాళ మధ్యాహ్నంవరకూ నువు ఆపసోపాలుపడి నా మతిపోగొట్టిం దెవరికోసం రా?... నువ్వు ఆమెని ప్రేమించలేదూ ?" అన్నాడు అప్పారావు ఆశ్చర్యంగా కుర్చీలో కూర్చుంటూ.

"నాన్సెన్స్! మా నాన్న నాకు వేరే సంబంధం చూశాడు. నేను చూడకపోతేనేం. ఆయన ఎన్నికచేసిన పిల్ల బాగుంటుందని నాకు గట్టినమ్మకం ఉంది."

కుర్చీలో కూర్చున్న అప్పారావుకి, ప్రక్కనే ఉన్న బల్లమీద ఓ ఉత్తరంలాంటిది కనబడింది. రాజుమాటలు వింటూనే చదివాడు...

"తాంబూలాలు ఇచ్చుకున్నాము... ఈ సంబంధం కనక...డొక్క వాలికలు చేసేస్తాను...వె... వేషాలు వెయ్యక...టనే రావలెను. అని కనబడింది.

ఇట్లు జగన్నాథము"

పచార్లు చేస్తున్న రాజు ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. "అసలు అదీ కాక..."

"మరే, మరే, నీ క్కావలసిందేదో నీకే తెలిదనుకో ...అసలది కాక, సరూని నువ్వు చూసింది రెండు సార్లేగా, ఎడతెగని పితృభక్తితోటే..." అన్నాడు అప్పారావు హేళనగా.